క్లుప్తంగా

కలెక్టర్, ఎస్పీలను కలిసిన దళిత సంఘ నాయకులు



కలెక్టర్‌ను అభినందిస్తున్న నాయకులు

సరుబుజ్జిలి: జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డిలను జిల్లా ఎస్సీ, ఎస్టీ సంఘం నేతలు మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. అధికారులను కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు గొల్లపల్లి యర్రయ్య, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు శశికుమార్, శ్రీధర్, వసంత, జగదీష్, మహేష్, తారకేష్ ఉన్నారు.

యాంత్రీకరణతో రైతన్నకు మేలు



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

సారవకోట: విత్తనాలు, ఎరువులు ఒకేసారి వేసుకునే యంత్రాలతో రైతులకు మేలు చేకూరుతోందని మండల వ్యవసాయాధికారి కేసీహెచ్ వెంకటరావు అన్నారు. వడ్డినవలస గ్రామంలోని ఇప్పిలి రామ్మోహనరావు పొలంలో ఇటీవల సీడ్ కమ్ ఫెర్టిలైజర్ యంత్రంతో వేసిన వరి పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువు ఒకేసారి వేయడం వలన ఒకే వరుసలో దుబ్బులు వస్తాయన్నారు. దుబ్బులు మధ్య దూరం ఉండటంతో గాలి, వెలుతురు బాగా తగిలి మొక్క ఏపుగా పెరగడం ద్వారా దిగుబడి అధికంగా వస్తోందన్నారు.

నారాయణపురం కాలువలో పూడికతీత పనులు



పొక్లయినర్‌తో పూడికతీత పనులు చేపడుతున్న దృశ్యం

బూర్జ: మండలంలోని పలు గ్రామాల ఆయకట్టుకు సాగునీటిని అందించే నారాయణపురం ఎడమ కాలువలో పూడిక తీత పనులు ప్రారంభించినట్లు ఇరిగేషన్ అధికారులు మంగళవారం తెలిపారు. మంగళవానం నారాయణపురం ఎడమ కాలువలో 1.1 కిలోమీటర్ల మేర రూ. 1.50 లక్షలు అంచనా వ్యయంతో పూడిక తీత పనులు చేపట్టారు. అలాగే ఓవీ పేట గ్రామం దగ్గర హైలెవల్ కెనాల్‌లో రూ. రెండు లక్షల రూపాయలతో పూడికతీత పనులు చేపడుతున్నారు.

ఎరువులు పంపిణీ



రైతులకు ఎరువులు అందజేస్తున్న నాయకులు

బూర్జ: మండలంలోని ఓవీపేట గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై ఎరువులను మంగళవారం పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

వసతి గృహాల్లో 429 సీట్లు భర్తీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: నరసన్నపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సీట్లలో 429 భర్తీ చేశారు. వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్స్ అడ్వయిజరీ కమిటీ సమావేశం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ వసతి గృహాల్లో 320, ఎస్సీ వసతి గృహాల్లో 109 సీట్లు భర్తీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వసతి గృహాల్లో మౌలిక వసతులు, మెనూ గురించి వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని.. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వసతి గృహాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏబీసీడబ్ల్యూఓ చాముండేశ్వరి, వసతి గృహ మేట్రిన్లు పాల్గొన్నారు.

18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

నరసన్నపేట: నియోజకవర్గంలో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకూ సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపడుతున్నట్లు జనసేన పార్టీ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటీర్‌గా పనిచేయాలనుకునేవారు తమను సంప్రదించాలన్నారు.

ఆధ్యాత్మిక శోభ



పాతపట్నం: సారెను ఊరేగిస్తున్న భక్తులు

సారవకోట: ఆషాఢ మంగళవారం సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకుంది. ఆవేటి మంగళవారం పూజలను వైభవంగా నిర్వహించారు. సారవకోట మండలంలోని పలు గ్రామా గ్రామదేవత, అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. మహిళలు ఘటాలతో ఆలయాలకు వెళ్లి అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామదేవతలకు పూజలు

జలుమూరు: చెన్నాయవలస, పాగోడు, యలమంచిలి, కొమనాపల్లి గ్రామాల్లో ఆయా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నూతన వస్త్రాలు, నైవేద్యం సమర్పించారు. పంటలు బాగా పండాలని ముర్రాటలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారి సారె ఊరేగింపు

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన పాతపట్నం నీలమణి అమ్మవారికి కూర్మాపు వెంకటరమణ ఆధ్వర్యంలో మహిళలు సారెను సమర్పించారు. ముందుగా సారెను ఊరేగించారు. శివంకర్ కాలనీ ఐదవ లైన్ నుంచి ప్రధాన రహదారి మీదుగా మార్కెట్, బ్రహ్మణవీధి, జుబ్లీరోడ్డు మీదుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సారెను సమర్పించారు. విజయవాడకు చెందిన సన్నాయి వాయిద్యం అలరించింది.

జగన్నాథస్వామి అవతారంలో..

నరసన్నపేట: రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా నరసన్నపేటలోని వేంటేశ్వరాలయంలో జగన్నాథ స్వామి అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అలాగే శయన ఏకాదశి సందర్భంగా బుధవారం తులసీ దాలర్చన నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

ఆర్.ఆర్.కాలనీలో..

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీ (కృష్ణాపురం)లో ఆవేటి వారాలను ఘనంగా జరుపుకున్నారు. ఘటాలు, ముర్రాటలను మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించారు. అనంతరం గ్రామ దేవత గుడివద్దకు చేరుకొని అమ్మవారికి ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు.



నరసన్నపేట: జగన్నాథ అవతారంలో స్వామివారు



సారవకోటలో గ్రామదేవతకు పూజలు చేస్తున్న భక్తులు



కొత్తూరు: ఘటాలను ఊరేగిస్తున్న బిట్-1 ఆర్ఆర్ కాలనీ వాసులు



జలుమూరు: చెన్నాయవలసలో ముర్రాటలు తీసుకువెళ్తున్న భక్తులు

హెల్మెట్‌తో ప్రాణరక్షణ

- జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి



మాట్లాడుతున్న జడ్జి ఎస్.మణి

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణరక్షణ పొందాలని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. హెల్మెట్ వినియోగంపై కోర్టు ఆవరణలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. పెరుగుతున్న ట్రాఫిక్ నేపథ్యంలో ప్రమాదాలు కూడా అధికంగానే జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నుంచి ప్రాణ రక్షణ పొందేందుకు హెల్మెట్ వాడడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే చిన్నారులు వాహనాలు నడపకూడదన్నారు. 90 శాతం రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడంతోనే తలకు గాయాలై ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.నరసింహులు, సీనియర్ న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, గోవిందరావు, హెచ్.అప్పలనాయుడు, బొడ్డేపల్లి మోహన్‌రావు, పలువురు కక్షిదారులు పాల్గొన్నారు.

‘ఎర్ర చెరువు ఆక్రమణలను తొలగించండి’



చెరువుకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఎర్ర చెరువును సర్వేచేసి ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశించారు. చెరువును రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్ 16లో ఐదు ఎకరాల ఎనిమిది సెంట్ల విస్తీర్ణంలో చెరువు ఉండగా.. కొంతభాగాన్ని కప్పేసి ఆక్రమించినట్టు గుర్తించారు. రెండు రోజుల్లో చెరువులో కొలతలు వేయాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదారావు, మండల సర్వేయర్ రామగణపతి, వీఆర్వో పార్థసారధి, నాయకులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, అక్కందర సన్యాసిరావు, శ్రీరామ్‌దుర్గా ప్రసాద్, శిర్ల జోగారావు, ప్రభాకరరావు, అశోక్, బుల్లిబాబు ఉన్నారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు

- ఎమ్మెల్యే రవికుమార్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆర్ఆర్ కాలనీలో ఇటీవల మరణించిన టీడీపీ నాయకుడు రామశంకర్ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. అనంతరం కాలనీలో ప్రజా దర్బార్ నిర్వహించి మాట్లాడారు. గాజుల కొల్లివలస సమీపంలో వంశధార నిర్వాసితులకు ఏర్పాటు చేసిన ఆర్ఆర్ కాలనీలో జరిగిన భూ ఆక్రమణలపై సమగ్ర నివేదిక అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మహిళలు పలు సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యేకు అందజేశారు. వంశధార నిర్వాసిత గ్రామాలైన తులగాం, పాడలి, దుగ్గుపురం, బొర్రంపేట, చిన్న కొల్లివలస గ్రామాలకు చెందిన సుమారు 530 కుటుంబాలకు అప్పటి గత టీడీపీ ప్రభుత్వం మూడు బ్లాకులుగా విభజించి ఒక్కొక్కరికీ ఐదు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలను మంజూరు చేయగా కొంత స్థలం రిజర్వ్‌లో ఉంచడం జరిగిందన్నారు. రిజర్వ్ స్థలాలను కొంతమంది దారాదత్తం చేశారని అక్కడి ప్రజలు ఎమ్మెల్యే దృష్టి తీసుకువచ్చారు. బ్లాక్ -2లోని కమ్యూనిటీ హాల్ స్థలంలో మండలంలోని కొర్లకోట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పేరిట పట్టాను మంజూరు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, సమగ్ర సర్వే పూర్తి విచారణ చేసి నివేదిక అందజేయాలని సర్వేయర్ బొడ్డేపల్లి గోపిని ఎమ్మెల్యే ఆదేశించారు. మండల టీడీపీ అధ్యక్షులు నూకరాజు, నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, గొండు రమణమూర్తి, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించరా?

- మండల సర్వసభ్య సమావేశంలో నిలదీసిన ప్రజాప్రతినిధులు



అధికారులను నిలదీస్తున్న ఎంపీపీ సరోజనమ్మ, సభ్యులు

టెక్కలి : ప్రభుత్వం ఏదైనప్పటికీ ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో విత్తనాలు, పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. ఎటువంటి అర్హత లేనివారితో పంపిణీ చేయించడం తగదన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరికీ సమాచారం అందజేసి కార్యక్రమాలు నిర్వహించే వారమని గుర్తు చేశారు. డయేరియా, మలేరియా విస్తరిస్తున్న నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సభ్యులు కోరారు. సమావేశంలో చర్చించిన సమస్యలను నమోదు చేయడానికి ప్రత్యేకంగా అధికారిని ఏర్పాటు చేసి సభ అనంతరం ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించేలా చూడాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ కె.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ పి.రమేష్, సూపరింటెండెంట్ హెచ్.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో వివక్ష చూపిస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట:ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని, ఈ విషయంలో అన్యాయం చేస్తే సహించేది లేదని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.రామారావు ఆధ్వర్యంలో ఎంపీపీ నిమ్మన దాస్ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మాట్లాడుతూ జూలైలో తక్కువ వర్షపాతం కురవడంతో వరినారు పూర్తిగా మొలవలేదన్నారు. మండలంలో 247 మంది కౌలు రైతులను గుర్తించి సాగుదారు పత్రాలు అందజేసినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈ రమేష్ మాట్లాడుతూ పూర్తయిన సచివాలయాల భవనాల నిర్మాణాలకు త్వరలో బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఉపాధి ద్వారా కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేశామన్నారు. కొర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సౌజన్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్ చేయూత పథకం నిధులు అందరికీ జమచేసేలా చర్యలు తీసుకోవాలని గొల్లూరు సర్పంచ్ పిన్నింటి ఈశ్వరావు, పాలవలస సర్పంచ్ మర్ల హేమలత తదితరులు కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ పింఛన్లు పంపిణీలో ఎవరైనా కక్షసాధింపు చర్యలకు దిగితే అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ప్రొటోకాల్ ప్రకారం గ్రామస్థాయిలోని ప్రజా ప్రతినిధులకు అధికారులు సమాచారం అందజేయాలన్నారు. అధికార పార్టీనాయకులు చెప్పారని విధులను అతిక్రమిస్తే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ గురాల శ్రీను, కర్తలిపాలెం ఎంపీటీసీ మంగి గణపతి, కో-ఆప్షన్ సభ్యులు ఐ.లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



కుర్చీలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. చదువుకున్న పాఠశాలకు 25 కుర్చీలు సమకూర్చారు. వీటిని ప్రధానోపాధ్యాయుడు ఎ.గోవిందరావుకు మంగళవారం అందజేశారు. పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

విత్తన బంతుల తయారీపై శిక్షణ



శిక్షణ నిర్వహిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: రవిశంకర్ గురూజీ ఆదేశాల మేరకు జూన్ 5 నుంచి ఆగస్టు 19 వరకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు తెలిపారు. నగరంలోని బ్యాంకర్స్ కాలనీలోని విశాఖ స్కూల్లో మంగళవారం విద్యార్థులకు సీడ్‌బాల్స్(విత్తన బంతులు) తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని గురూజీ ఇచ్చిన పిలుపు మేరకు పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యతపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి దార్లపూడి రవి మాట్లాడుతూ మొక్కల పెంచడానికి అవసరమైన సీడ్ బాల్స్‌ను ఎలా తయారు చేయాలనే అంశంపై ఈ నెలాఖరులోగా 20 పాఠశాలలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 200మంది విద్యార్థులతో 800 విత్తన బంతులు తయారు చేసినట్లు వివరించారు. వీటిని డ్రోన్స్ ద్వారా గాని, ఇండియన్ నేవీ ద్వారా గానీ వర్షపాతం తక్కువగా ఉన్న మండలాలు, కొండ ప్రాంతాల్లో వెదజల్లుతామని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ అధినేత తమ్మినేని మధుసూదనరావు, ప్రధానోపాధ్యాయులు రామారావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు బెవర రవిశంకర్, టీచర్లు వారణాసి సందీప్, దేసూళ సురేంద్ర, వలంటీర్ పి.శ్రీనివాస్, సీటీసీ మెంబర్ అన్నపూర్ణ, అను తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. చెట్టుపొదిలాం ఎంపీటీసీ సభ్యురాలు పట్నాన శాంతి అత్త సూరమ్మ గుండె సమస్యతో బాధపడుతుంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అందరూ బాగా పని చేశారన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. స్థానిక సర్పంచ్ భూపతి సురేష్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, ఎందువ మురళీ, కిల్లారి చిన్నంనాయుడు, పట్నాన దాలిరాజు ఉన్నారు.

వరి నారుమడుల పరిశీలన



పలాసపురంలో నారుమడులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సోంపేట: మండలంలోని పలాసపురంలోని వరి నారుమడులను సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మంగళవారం పరిశీలించారు. జూలైలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మెరక ప్రాంతాలైన పలాసపురం, బెంకిలి, జింకిభద్ర, గొల్లూరు, మామిడిపల్లి తదితర గ్రామాల్లో నారు మొలక శాతం తక్కువ వచ్చినట్లు గుర్తించారు. ఈ నెల 20 వరకు వర్షాలు పడకపోతే నారు చాలకపోయే అవకాశం ఉందన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరాకు అంచనాలు రూపొందిస్తామన్నారు. వ్యవసాయ సహాయకులు మూడు రోజుల్లోగా వివరాలు సేకరించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ సింహాచలం

పాతపట్నం: విద్యార్థి దశ నుంచే పిల్లలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఏఎస్ఐ జి.సింహాచలం అన్నారు. స్థానిక రవీంద్ర భారతీ పాఠశాలలో నాయకత్వ లక్షణాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు క్రమశిక్షణతో చదువుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు బి.ప్రభాకరరావు, డీన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక ధరకు కందిపప్పు విక్రయిస్తే కేసులు



కందిపప్పు విక్రయ వివరాలు పరిశీలిస్తున్న డీటీ రవికుమార్

కొత్తూరు: బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు 160 రూపాయలకంటే ఎక్కువకు విక్రయించే వ్యాపారులపై కేసు నమోదు చేస్తామని స్థానిక సివిల్‌సప్లై డీటీ రవికుమార్ హెచ్చరించారు. కొత్తూరులోని బత్తిలి రోడ్డులో ఉన్న అమృత హోల్‌సేల్ షాపులో కందిపప్పు అమ్మకాలను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని షాపు యజమానికి సూచించారు. వీఆర్వో రాము ఉన్నారు.

జగన్నాథుని ఆలయానికి విరాళం

కవిటి : ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం కవిటిలో వెలసిన జగన్నాథ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు రూ.35,000 విరాళాల్ని అందించడం అభినందనీయమని జగన్నాథ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం రిటైర్డ్ డీఎస్పీ ఎస్‌వీవీప్రసాదరావు సమక్షంలో జగతి గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐ లమ్మత శేషశయనం రూ.25000, మదనాపురం మాజీ సర్పంచ్ మార్పు వెంకటేశం రూ.10,000 చొప్పున విరాళాల్ని కమిటీ పెద్దలకు అందించారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణానికి నిధులు అవసరం ఉన్న నేపథ్యంలో రిటైర్డ్ డీఎస్పీ తనవంతుగా కొంతమొత్తాన్ని, తన స్నేహితుల ద్వారా మరికొంత మొత్తాన్ని అందించడంలో ప్రసాదరావు కృషిని కమిటీ సభ్యులు కొనియాడారు.

కొంగరాం పంచాయతీలో నీటి శాంపిళ్లు సేకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: కొంగరాం పంచాయతీ పరిధి కొంగరాం, చినకొంగరాం, ఏసీఎస్ పేట గ్రామాల్లో మంచినీటిబావులు, బోరు బావుల నుంచి నీటి శాంపిళ్లను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డి.హేమలత ఆధ్వర్యంలోని బృందం మంగళవారం సేకరించింది. స్థానికంగా ఉన్న ఓ రసాయన పరిశ్రమ వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయని స్థానికులు సోమవారం జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో నిర్వహించిన మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ సెల్)లో ఫిర్యాదు చేశారు. దీంతో నీటిని ల్యాబ్‌ల్లో పరీక్షించాలని ఉన్నత అధికారులు సూచించారు. నీటి నమూరాలు పరీక్షించి, ఫలితాలు త్వరలో ప్రజలకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. కాగా పరిశ్రమ ఆవరణలో ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బుడగుట్లపాలెంలో గ్రామ దేవత ఉత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెంలోని కొత్తమ్మతల్లి గ్రామ దేవత ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.